ప్రజాశక్తి



'అంగన్వాడీ'ల వివరాలు ఇవ్వండి : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : అంగన్వాడీ పోస్టుల నోటిఫికేషన్ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను తనకు ఇవ్వాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల ఎంపిక, పోస్టుల నియామకంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్ల పోస్టులను గుర్తించాలన్నారు. ఖాళీ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి ఫైల్ మంగళవారం సాయంత్రంలోపు తమకు అందజేయాలని ఐసిడిఎస్ ఆర్‌జెడిని ఆదేశించారు. పదోన్నతులు, బదిలీలు, అంగన్వాడీ కేంద్రాల మార్పు తదితర వివరాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఐసిడిఎస్ ఆర్‌జెడి పద్మజ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందిస్తాం

- ప్రతి ఏడాది జాబ్‌క్యాలెండర్ విడుదల
- రైతులకు సబ్సిడీ పథకాల పునరుద్ధరణ
- యువగళం పాదయాత్రలో నారాలోకేష్

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్

ప్రస్తుతం కోతల పాలన కొనసాగుతోందని, 2024లో టిడిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పాలను అందిస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 52వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తిప్పరాజుపల్లి నుంచి మొదలైంది. అక్కడ నుంచి గోరంట్ల, గుమ్మయ్యగారిపల్లి వరకు కొనసాగింది. సాయంత్రం గమ్మయ్యగారిపల్లి విడిది కేంద్రం వద్ద బస చేశారు. వడ్డెర, నాయీబ్రాహ్మణులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను నారా లోకేష్‌కు విన్నవించారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. లోకేష్‌ని చూసేందుకు రోడ్ల పైకి జనం భారీగా చేరుకున్నారు. వీరందరికీ అభివాదం చేస్తూ, పలకరిస్తు లోకేష్ పాదయాత్రను కొనసాగించారు. గోరంట్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి హవా కొనసాగడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వణుకు పుడుతుందని చెప్పారు. మద్యపానాన్ని నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మద్యాన్ని ఏరులైపారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి సైతం రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు జాబ్ కాలండర్ విడుదల చేస్తామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్పును అందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అది అందడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రైతులకు సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని మరచి పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సబితమ్మ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, మరిరెడ్డిపల్లి నరసింహులు, బాలకష్ణ చౌదరి, దాసయ్య, ఫిరోజ్ బాషా పాల్గొన్నారు.



గోరంట్లలో యువగళం పాదయాత్రలో పాల్గొన్న టిడిపి శ్రేణులు



లోకేష్‌కు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

అడుగడుగునా ఘనస్వాగతం

గోరంట్ల మండలంలో నారా లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం లభిస్తోంది. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలుకుతున్నారు. గోరంట్లలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప నివాసం వద్ద భారీ గజమాలతో స్వాగతం పలికారు. గాంధీ విగ్రహం వద్ద టిడిపి నాయకులు జయరాం, వేణు, బాలాజీ, రాయల్ నరేంద్ర, నీలకంఠారెడ్డి, నరసింహప్ప, సుధాకర్ రెడ్డిలు సైతం గజమాలతో స్వాగతం పలికారు. బస్టాండ్ వద్ద మైనార్టీ యువ నాయకుడు ఉమ్రాన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఎరుకుల సంఘం గౌరవాధ్యక్షులు ఎల్ఎన్.నారాయణస్వామి యాపిల్‌పండ్లతో తయారుచేసిన గజమాలతో స్వాగతం పలికారు.

సమస్యలు పరిష్కరించకుండా..సమ్మేళనాలా..?

- పట్టు రైతులపై ప్రభుత్వానికి చిన్నచూపు
- మద్దతు ధర నిర్ణయించకుండా నిర్లక్ష్యం
- పట్టు రైతు సమ్మేళన సభ వద్ద నిరసన



రైతు సమ్మేళన సభ వద్ద అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టు రైతులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

'పట్టు రైతుల సమస్యలను పరిష్కరించాలని గత నాలుగు సంవత్సరాలుగా స్థానిక అధికారుల నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు వినతిపత్రాలను ఇచ్చాం. స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ముఖ్యమంత్రి వరకు సమస్యలను అనేకమార్లు విన్నివించాం. అయినా పట్టు రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు. సమస్యలకు పరిష్కారం చూపకుండా పట్టు రైతులకు ఏదో మేలు చేశామన్నట్టు పట్టు రైతు సమ్మేళనం నిర్వహించడం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదు. పట్టుగూళ్లకు కనీస మద్దతు ధర నిర్ణయించి, రైతులను సమస్యలను పరిష్కరించాలి. లేకుంటే ఎన్ని సమావేశాలు నిర్వహించినా ప్రయోజనం లేదు'. అంటూ పట్టు రైతులు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని టిటిడి కళ్యాణమండపంలో కేంద్ర, రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పట్టు రైతులసమ్మేళనం-2023 సభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఉమ్మడి కర్నూలు, చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు రైతులు, కేంద్ర రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సభ ప్రారంభం కాగానే రైతులు నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దాదాపు 3 గంటల పాటు సమావేశం భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టు రైతులు ఆనంద రంగారెడ్డి, చైతన్య గంగిరెడ్డి, ధనాపురం వెంకటరామిరెడ్డి, నవీన్, జయరామిరెడ్డి తదితరులు మాట్లాడుతూ గతంలో బైవోల్టీన్ పండించే పట్టు రైతులకు కిలో రూ.50 చొప్పున ప్రోత్సాహం అందించేవారని, గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి ఈ ప్రోత్సాహం ఒక్క రైతుకూ అందలేదన్నారు. దాదాపు రూ.50 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి బైవోల్టీన్ ప్రోత్సాహం నగదు పట్టు రైతులకు అందాల్సి ఉందన్నారు. ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు ఇన్సెంటీవ్ రూపంలో బకాయిలు రావాల్సి ఉన్నాయని తెలిపారు. పట్టుపరిశ్రమ అంటే ప్రభుత్వానికి పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్సీడి ధరకు గతంలో అందించే మందులు, ఇతర పరికరాలు, నేతికలు, మల్బరీ షెడ్లకు ఆర్థిక సాయం ఇవ్వడం లేదన్నారు. పెరిగిన ధరలతో రైతులు పట్టుగూళ్ల ఉత్పత్తి చేయటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. పట్టుగూళ్లకు కనీస మద్దతు ధర నిర్ణయించి పట్టు రైతులను ఆదుకోవాలన్నారు. పట్టు రైతుల సమస్యలను పరిష్కరించిన తరువాతనే పట్టు రైతు సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించాలని పట్టుబట్టారు. ఈ సమయంలో పట్టుపరిశ్రమ శాఖ ఆడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, అగ్రిబోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త కిరణకుమార్ తదితరులు రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా రైతులు వారి మాటను వినలేదు. సమస్యల పరిష్కారంపై సమ్మేళనంలో అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసన విషయాలను అడిషనల్ డైరెక్టర్ కమిషనర్ దష్టికి సెల్‌ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. ఆయన నుంచి స్పష్టమైన హామీ రాకపోవటంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు రైతులకు ఎంత నచ్చజెప్పిన వారు వినక పోవడంతో సభను అర్ధాంతరంగా ముగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భోజన విరామం అనంతరం అక్కడున్న రైతులతో అధికారులు పట్టురైతుల సమ్మేళనాన్ని నిర్వహించి మమ అనిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, సిబ్బంది, పట్టు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ముందుకు సాగేనా..?

- కోనసీమకు 'పురం' కమిషనర్ బదిలీ
- రాజకీయ కారణాలే కారణమా..?
- అభివృద్ధి పనులపై అనుమానాలు



ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురానికి రాష్ట్ర చరిత్రలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ నుంచి గెలచిన వారు ముఖ్యమంత్రిగా పని చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు సినీహీరోగా దేశ, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన వారు పాలకులు చెప్పిందే వేదంగా పని చేశారు. అయితే ప్రస్తుత కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు అందరి భిన్నంగా పట్టణాభివృద్దే తన లక్ష్యంగా పని చేస్తు ముందుకు వెళ్లారు. పట్టణంలో ధీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గం చూపించారు. దీంతో పాటు మురుగు కాలువలను ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వాటిని సైతం గుర్తించి, వాటిని తొలగించారు. దీంతో చిన్న పాటి వర్షాలకే జలమయమవుతున్న గాంధీనగర్, హస్నాబాద్, న్యూ హస్నాబాద్ తదితర ప్రాంతాలు గడిచిన సంవత్సరం అన్ని చెరువులు పొంగి పొర్లిన ఆయా ప్రాంతాల్లో చుక్క నీరు నిలబడలేదు. అయితే గత కొంత కాలంగా అధికార పార్టీ నాయకులతో పాటు పాలకుల చెప్పిన ప్రతిదానికి ఆయన తల ఊపకపోవడంతో గత ఆరు నెలలుగా కమిషనర్ బదలీ కోసం ప్రయత్నం సాగుతున్నాయి. దీంతో చివరకు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును రాయలసీమలో ఉన్న హిందూపురం నుంచి కోనసీమలో ఉన్న నరసాపురానికి బదిలీ చేస్తు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మున్సిపల్ కమిషనర్‌గా 2సంవత్సరాలు 5 నెలల పాటు పని చేసిన డాక్టర్ వెంకటేశ్వరరావు కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నా రైల్వే రోడ్డు విస్తరణ పనులు 80శాతం పూర్తి చేయించారు. అసంపూర్తిగా ఉన్న మార్కెట్ పనులను వేగవంతంగా పూర్తి చేసి, గదులను బహిరంగ వేలం వేసి వ్యాపారులకు కేటాయించారు. మూడు దశాబ్దాలుగా నాయకుల చేతులో ఉన్న రాజీవ్ ట్రస్టు భవనాలను మున్సిపల్ శాఖ స్వాధీనం చేసుకుని, వాటిని అద్దెకు ఇచ్చి వాటి ద్వారా పురపాలక సంఘానికి ఆదాయం వచ్చేలే చేశారు. పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్నా మురుగు నీటి వ్యవస్థను మెరుగు పర్చడమే కాకుండా కొంత మంది మురుగు కాలువలను ఆక్రమించుకుని చేసుకున్న నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగింపజేచారు. రహమత్‌పురం, ఆబాద్‌పేట, ఎస్‌బిఐ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించుకుని కట్టిన నిర్మాణాలను సైతం తొలగించి, పట్టణ అంతర్గత రహదారులను విస్తరింప జేశారు. పట్టణ ప్రజలకు మంచి ఉద్యాన వనం ఏర్పాటు చేయాలని పారిశ్రామిక వేత్తలతో చర్చించి సడ్లపల్లి చెరువులో ఆక్సిజన్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అక్కడ మొక్కలు నాటి వాటిని పెంచుతున్నారు. ఇలా ఎన్నో మంచి పనులు చేసిన కమిషనర్‌ను ఉన్నఫలంగా బదిలీ చేయడం అన్యాయమని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రైల్వే రోడ్డు విస్తరణ పనులు అంతేనా....?

పట్టణ ప్రజల చిరకాల కోరికైన రైల్వే రోడ్డు విస్తరణ పనులు ఇక ముందు జరుగుతాయా లేదా అన్న అనుమానాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. రైల్వే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ రోడ్డుని వెడల్పు చేయాలని గత కొన్ని సంవత్సరాలగా రాజకీయ నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా కొన్ని రాజకీయ ఒత్తిళ్ల వల్ల రోడ్డు విస్తీర్ణ పనులు ఆగిపోయాయి. ఇలాంటి తరుణంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ ప్రోత్సాహంతో ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో రైల్వే రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో భవనాలు కోల్పోతున్నవారు గగ్గోలు పెట్టారు. అలాంటి వారికి నచ్చ చెప్పి ప్రభుత్వం నుండి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటూ వారి నిర్ణయం మేరకు రోడ్డు విస్తరణకు భూమి పూజ చేశారు. ప్రస్తుతం ఇరు ప్రక్కల డ్రయినేజీ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో అభివద్ధి చేసే కమిషనర్ రావడంతో రోడ్డు వెడల్పుకు మహర్దశ వచ్చిందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సమయంలో కమిషనర్ బదలీ కావడంతో ఈ పనులు ముందుకు సాగుతాయా...? లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పాలక వర్గంతో ఉన్న విబేధాలే...

మున్సిపల్ కమిషనర్‌గా సమర్థవంతంగా పని చేస్తూ నియోజక వర్గ ముఖ్య ప్రజాప్రతినిధి మాట మాత్రమే వింటూ, మిగిలిన వారి మాటలు వినక పోవడంతో కమిషనర్‌పై పాలక వర్గం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటులో కమిషనర్, చైర్‌పర్సన్ మధ్యలో విభేధాలు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెతో పాటు కొంత మంది కౌన్సిలర్లు ముఖ్యప్రజాప్రతినిధి వద్దకు వెళ్లి కమిషనర్‌ను బదలీ చేయించాలని పట్టుబట్టారు. చివరకు నాయకుల వైపు ఆయన మొగ్గు చూపి బదిలీ చేయాలని పురపాలక శాఖకు లేఖ పంపారు. దీంతో మున్సిపల్ కమిషనర్ బదిలీ జరిగినట్లు తెలుస్తోంది.



కమిషనర్ గుర్తించిన ఆక్రమణకు స్థలం (పాతచిత్రం)

ఎమ్మెల్యే సవాల్‌కు నేను సిద్ధం : పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

టిడిపి హయాంలో పుట్టపర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పైనా, ఈ నాలుగేళ్ల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చేసిన అభివృద్ధి పైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రకటించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్లె మాట్లాడారు. ఏప్రిల్ 2 సత్తెమ్మ గుడి దగ్గర నియోజకవర్గ అభివృద్ధి, అవినీతిపైన చర్చకు సిద్ధమా అని పల్లె సవాలు విసిరారు. నియోజకవర్గంలో తట్టడు మట్టి వేయలేని ఎమ్మెల్యే అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జాతీయ రహదారులకు వైసిపి ప్రభుత్వానికి ఏమిటి సంబంధం అని అన్నారు. దేశవ్యాప్తంగా 580 జిల్లాలను కలుపుతూ 35 వేల కిలోమీటర్లు రూ. 50వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేపడుతోందని ఇందులో వైసీపీ ప్రభుత్వానికి ఏమి సంబంధం లేదని అన్నారు. శ్రీధర్ రెడ్డి చేసిన దోపిడీపై పక్కా సమాచారంతో లోకేష్ ఓడిసిలో మాట్లాడారని అన్నారు. తనపైన కాని, లోకేష్ పైన కాని అనవసరంగా ఆరోపణలు చేస్తే పరిణామాలు వేరుగా ఉంటాయన్లి హెచ్చరించారు. నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర విజయవంతం చేసినందుకు పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి పల్లె

నిబంధనలకు విరుద్ధంగా 'ప్రయివేటు' ప్రచారం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరేష్

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వ రంగ విద్యాసంస్థల ఆవరణాల్లో ప్రైవేట్ విద్యా సంస్థల ప్రచారం ముమ్మరంగా చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఈ ప్రచారాన్ని వెంటనే ఆపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ మాటల గారడీతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. మడకశిర ప్రభుత్వ కళాశాల ఆవరణంలో నాలుగు ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండటంతో ప్రవేట్ విద్యాసంస్థల సిబ్బంది తమ కళాశాలల్లో చేరాలని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ విచ్చల విడిగా ప్రచారం చేస్తున్న ప్రవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీ

చిరుధాన్యాలపై అవగాహన

తలుపుల : మండల కేంద్రంలోని కెజిబివిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కొర్రలు, సజ్జలు, రాగులు, మినుములు, జొన్నల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఒ మోహనమ్మ, అధ్యాపకులు, అంగన్వాడీ కార్యకర్తలు సుశీల, రామకుమారి, అశ్వని, రమాదేవి, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌పై విమర్శలు తగదు : టిడిపి

బుక్కపట్నం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిని విమర్శించే స్థాయి వైసిపి పుట్టపర్తి మహిళా కౌన్సిలర్ సాయి లీలకు లేదని హిందూపురం తెలుగు మహిళ పార్లమెంట్ కార్యదర్శి మాధవి, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్ అన్నారు. తెలుగుదేశం నాయకులను విమర్శించే ముందు తమ స్థాయి ఏమిటో తెలుసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.

కేంద్ర తీరుతో రాష్ట్రానికి నష్టం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర ప్రభుత్వం అనుచరిస్తున్న నిరంకుశ వైఖరి వలన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని, దీనికి తోడు వారు అవలంబిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కూడా వత్తాసు పలకడంతో తీవ్ర నష్టం వాటితోందని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య విమర్శించారు. సిపిఐ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్‌డిఒ కార్యాలయం ముందు రెండు రోజులపాటు సామూహిక దీక్షలలో భాగంగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల నిరంకుశ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంజి, బయన్న, కదిరప్ప, కుల్లాయప్ప, మహిళా సమాఖ్య కన్వీనర్, జయలక్ష్మి, సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ , నాయకులు భాషా, రమణ, ఈశ్వరయ్య, మహిళా నాయకురాలు జ్యోతి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించండి

పరిగి : మండలంలోని బీచిగానిపల్లిలో ఎస్సీ ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం స్పందన కార్యక్రమంలో తహాశీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో బీచిగానిపల్లి లో దళితులను గొడవలు ఘర్షణలకు వినియోగించుకుంటూ వారిని నేరస్తులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చట్టాలపై వారికి అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి నేరాల రూపంలో జైలు పాలై ఇబ్బందులు పడుతున్నారన్నారు వెంటనే జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫారసు అమలు చేసే విధంగా గ్రామంలో ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన ఆమె అతి త్వరలో గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి www.prajasakti.com

'వాల్మీకులను మోసం చేస్తే సహించం'

ధర్మవరం టౌన్ : వాల్మీకి, బోయలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని వాల్మీకి ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, మాజీ ఎంపిపి మద్దిలేటి, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు గొట్లూరు చంద్ర హెచ్చరించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వాల్మీకి, బోయలను సిఎం జగన్ మోసం చేశారన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే విషయం కొత్తదేమీ కాదని, 1956 సంవత్సరం దాకా ఎస్టీలుగానే ఉన్నారన్నారు. నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నప్పుడే దేశంలో ఎక్కడా లేనివిధంగా కేవలం ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ వ్యత్యాసాన్ని చూపిస్తూ కొన్ని జిల్లాలను, ముఖ్యంగా రాయలసీమ జిల్లాలను ఎస్టీల నుంచి బీసీల్లోకి చేర్చి ద్రోహం చేశారన్నారు. గతంలో టిడిపి హయాంలో చంద్రబాబు కూడా వాల్మీకి బోయల పునరుద్ధరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా, గవర్నర్ ఆమోదం చేయకుండా పంపారని గుర్తు చేశారు. ప్రస్తుత సిఎం జగన్ కూడా గత ప్రభుత్వం తీర్మానాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకసభ్య కమిషన్ శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో కమిషన్ వేసి రాయలసీమ జిల్లాలో మాత్రమే అసెంబ్లీలో తీర్మానం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా వాల్మీకులను ఎస్టీల్లోకి ఎవరు పునరుద్ధరిస్తారో వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబశివ, నాయకులు జీకల రాజన్న, పూజ మొబైల్ సాయి జయరాం, బత్తలపల్లి మండల నాయకులు సాకే గోపాల్, కుర్లపల్లి మోహన్, ముష్టూరు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ సభ్యత్వం రద్దును నిరసిస్తూ ఆందోళన

ధర్మవరం టౌన్ : ప్రధాని మోడీ దేశ సంపదను కొల్లగొడుతున్నారని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని వంద సంవత్సరాల బ్రిటీష్ బానిసత్వం నుంచి విముక్తి కలిగించి దేశాభివృద్ధికి పాటుపడింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. దేశంలో ఓడిపోవు సంపదను కొల్లగొడుతూ.. మరో వైపు హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. అలాగే దేశంలో దాడులు, అత్యాచారాలు, పెరిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, నాయకులు చైతన్య, గణేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బిటెక్ ఉత్తీర్ణులకు శిక్షణ

బత్తలపల్లి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ సంయుక్తంగా ప్రభుత్వ యువజన ట్రైనింగ్ సెంటర్ రామగిరి స్కిల్ కళాశాల ద్వారా బీటెక్ ఐసిఇ, ఐఇఇ బ్రాంచ్‌ల్లో ఉత్తీర్ణులై వారికి ఆరు నెలలు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు బత్తలపల్లి భారతి మండల సమాఖ్య ఎపిఎం సుదర్శన్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా నూతన కోర్సులను ప్రారంభించినట్లు తెలిపారు. కోర్స్ పూర్తయిన తర్వాత వారికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్..91823 16114 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోట్లమర్రిలో శ్రీరామనవమి వేడుకలు

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామంలో వెలసిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30న శ్రీరామనవమి వేడుకలను నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించుకున్నారు. ఈమేరకు సోమవారం గ్రామంలోని ఆలయంలో గ్రామ పెద్దలు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో ఈ ఏడాది వేడుకలను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 30న గురువారం ఉదయం 10 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ప్రధాన అర్చకులు కొమండూరు మారుతీప్రసాద్, రమేష్, సాయికృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, భక్తు పెద్ద సంఖ్యలో ఉత్సవాలను కోడ్ నిబంధనలు అనుసరిస్తూ విజయవంతం చేయాలని కోరారు.

స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

పుట్టపర్తి రూరల్ : పెడపల్లి ఉన్న గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక డిపిఒ కార్యాలయంలో సిపిఎం విజయ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏపీ గ్రామపంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సిఐటియు నాయకులు పై పల్లి గంగాధర్ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిపిఒ స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా డిఎల్‌పిఒ, ఎంపిడిఒలకు సర్కులర్లు పంపిస్తూ తక్షణమే కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఓబులదేవర చెరువు : మండల వ్యాప్తంగా పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, కుల్లాయప్ప, రమణ డిమాండ్ చేశారు. ఈ ఈమేరకు వారు కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక ఎంపీడీవో పొలప్పకు అందజేశారు. సోమవారం వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు సంవత్సరం పాటు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, పోలమ్మ, నిర్మల, రామలక్ష్మమ్మ, సుగుణమ్మ, కుళ్లాయప్ప, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తలుపుల : మండలంలోని పెద్దన్నవారిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ నాగ లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్దారెడ్డి విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన లక్ష రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

గుడిబండ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా శాసనసభలో బిల్లు ఆమోదం చేసిన నేపథ్యంలో మండలంలోని వాల్మీకులు సోమవారం మండల కేంద్రంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి శివకుమార్, సర్పంచ్ కవిత ఓబన్న, వాల్మీకి సంఘం నాయకులు హనుమంతరాయప్ప, రంగప్ప, వీరన్న, శ్రీరామప్ప, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మడకశిర : మడకశిరలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల కమిటీ మెంబర్లు లక్ష్మీ కాంత్ రెడ్డి, రంగయ్య తనిఖీ చేశారు. సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న నాయకులు



సమస్యను పోలీసులకు వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పరిగి

జయమంగలి నదిలో ప్రభుత్వం ఇసుక తరలింపునకు టెండర్ ద్వారా మంజూరు చేయడంతో నిర్వాహకులు సోమవారం వాహనాలతో ఇసుకను తరలించేందుకు వచ్చారు. దీంతో సిపిఎం, వైసిపి నాయకులు ఇసుక తరలింపును అడ్డుకున్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇసుకతరలింపు పత్రాలను చింపివేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటిపోవటంతో ఐదేళ్లుగా తమ మండలంలో తాగేందుకు కూడా నీరు దొరకక తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. ఇటీవలే పుష్కలంగా వర్షాలు రావడంతో నది పరివాహక ప్రాంతాల్లో నీరు పొంగిపొర్లి కొరత తీరిందన్నారు. ఇలాంటి సమయంలో జయ మంగలి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు సరికాదని అన్నారు. ఈ ఆదేశాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే హిటాచి, టిప్పర్ వాహనాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పెనుగొండ సిఐ కరుణాకర్, ఎస్ఐలు నరేంద్ర, నాగ స్వామి, వెంకటరమణ, విజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. వాస్తవ పరిస్థితిని నాయకులు పోలీసులకు వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నాయకులను, వాహనాలను అక్కడినుంచి పంపించారు.



విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్ అందిస్తున్న పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు

పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం

హిందూపురం : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య ఛేదన కోసం క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే విజయం వారి వెంటే ఉంటుందని పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పాఠశాల తరఫున విద్యార్థులందరికీ పెన్నులు, పరీక్ష ప్యాడ్లను పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు విలువలతో కూడిన విద్య వివేకాన్ని పెంచుతుందని అన్నారు. పదవ తరగతిలో ఉమ్మడి జిల్లా మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ఇంటర్మీడియట్ చదువుకు పూర్తిస్థాయిలో పాఠశాల తరఫున ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తరఫున పాఠశాల తరఫున ప్రత్యేకంగా అభినందించి వారికి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. విద్యార్థులు వారి గురువులకు జ్ఞాపికలను అందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి నందకుమార్, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయత్రి, ఎహెచ్ఎం విజయేంద్ర, శశికళ, ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, షేక్ అబ్దుల్ రజాక్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులుగా బైసాని రాంప్రసాద్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులుగా హిందూపురం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బైసాని రాంప్రసాద్ ఎకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం అనంతపురం పట్టణంలోని శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అనంతపురం జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త, విద్యావేత్త, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అల్లుడు పైడా కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీ సత్య జిల్లాకు ప్రత్యేక కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షులు బైసాని రాంప్రసాద్ తెలిపారు. తనతో పాటు జిల్లా కమిటిని ఎంపిక చేశారన్నారు. పట్టణ వాసిని ఎంపిక చేయడం పట్ల హిందూపూర్ వాణిజ్య, పరిశ్రమల సంఘం నాయకులు శ్రీ చంద్రగుప్తా, దొంతి మహేంద్ర, కట్టా వెంకటేష్, షానవాజ్, ఇక్బాల్, సలీమ్, గోవర్ధన్ గుప్తా, అబీద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న నాయకులు

మహిళాభివృద్ధే వైసిపి ధ్యేయం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

కదిరి అర్బన్ : మహిళాభివృద్దే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపాలిటీ మైనార్టీ ఫంక్షన్ హాల్ నందు కదిరి మున్సిపాలిటీ స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో గల మొత్తం 953 స్వయం సహాయ సంఘాలకు రూ.5.91 కోట్ల రూపాయలను వారి ఖాతాలో జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు శంకర్ నారాయణ పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని వన్నిక ఫంక్షన్ హాల్ లో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత సంబరాలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. అనంతరం సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ ఛైర్మన్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, జయ శంకర్ రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి చూపించాలి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి చూపించాలని, పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో 190 అర్జీలను స్వీకరించిన కలెక్టర్ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులతో అభివృద్ధి పనులు, పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు నాలుగు 104 సంచార వైద్యశాలల వాహనాలు

జిల్లాకు నూతనంగా నాలుగు సంచార వైద్యశాలల వాహనాలు మంజూరు కాగా ఆ వాహనాలను కలెక్టర్ బసంత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం కలెక్టరేట్ నూతన సంచార వైద్యశాలల ను ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ వైద్యశాలలతో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, 104 జిల్లా నోడల్ అధికారి సెల్వియా, జిల్లా మేనేజరు శంకర్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ రామకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయండి

సోమందేపల్లి : మండల కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించి, ప్రభుత్వమే విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహశీల్దార్ మురళీకృష్ణకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నేటి యువతరం స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భగత్ సింగ్ జీవితం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమైనదని అన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్ నందు పెద్దమ్మ గుడి దగ్గర భగత్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించి విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, రైతు కూలీ సంఘం సీనియర్ నాయకులు ఖాసిం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, బెస్త కిష్టప్ప, ఉప్పర కిష్టప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు లక్కోరి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

చలోఢిల్లీ పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

రొద్దం : ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గంగాధర్, ఫకృద్దీన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నారాయణ, అరుణ, గంగాధర్, అనిత, రామాంజినమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చలో ఢిల్లీకి సంబందించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ నగరంలో లక్షల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నరసింహప్ప, నాయకులు రామకృష్ణ, అత్తర్ బాబా, జబివుల్లా, చంద్ర, జాఫర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

పుట్టపర్తి రూరల్ : స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలతో కూడిన అర్జీలను ఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పిఉమామహేశ్వర్ రెడ్డి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉపకార వేతనానికి రాయపురం విద్యార్థి

గుడిబండ : మండల పరిధిలోని ఎస్ రాయపురం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గగన్ అనే విద్యార్థి మండలంలోనే ద్వితీయ స్థానంలో మార్కులు సాధించి జాతీయస్థాయి ఉపకార వేతనానికి అర్హత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతి తెలిపారు. ప్రతి ఏటా ఈ పాఠశాల నుంచి విద్యార్థులు జాతీయ స్థాయి ఉపకార వేతనానికి ఎంపికవుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతీ తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థి గగన్‌ను అభినందించారు.

విగ్రహాల ప్రతిష్టాపన

సోమందేపల్లి : మండల పరిధిలోని తుంగోడు పంచాయతీలోని చిన్న బావయ్య పల్లిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కుటుంబం తరపున ఆలయానికి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఇంద్రజ, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నంతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రొద్దం : రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని పెనుగొండ డివిజన్ వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మంజువాణి ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భక్సంపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో మంజువాణి పాల్గొన్నారు. వైద్యసేవలపై వైద్యాధికారి డాక్టర్ ఎం జగదీష్‌బాబుతో చర్చించారు. కుటుంబ వైద్య విధానంలో తప్పనిసరిగా 64 రకాల మందులు, 14 రకాల డయాగ్నోసిస్ ఉండాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఒఆర్ఎస్ డిపో హోల్డర్స్ ని గుర్తించి తగినన్ని ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ లక్ష్మీ నరసమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ అలివేలమ్మ, గిరినాథరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించని వారిపై కేసులు

కొత్తచెరువు : కొత్తచెరువు గ్రామపంచాయతీలో గతంలో పంచాయతీ గదులకు వేలంపాటలో దక్కించుకొని బాడుగలు చెల్లించని వారిపై జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని గ్రామపంచాయతీ కార్యదర్శి గోపాల్ తెలిపారు. 14, 21, 28, 24, 37, 45 నెంబర్ల గదులకు బాడుగలు చెల్లించలేదని బకాయిలు రూ.17, 72,900లు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించాలని పలుమార్లు కోరినా ప్రయోజనం కన్పించలేదని దీంతో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామని అన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హిందూపురం : ఐదు సంవత్సరాలుగా పట్టణంలో ప్రదాన కూడళ్లలో సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి తరపున దాతల సహకారంతో చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తూ ప్రజల దాహార్తి తీర్చడానికి డాక్టర్ రవి శంకర్, వారి మిత్రులు ముందుకు రావడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం రైల్వే రోడ్డులోని అనంత పద్మనాభ స్వామి దేవాలయం ముందు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బాలాజీ మనోహర్ ప్రారంభించారు. సేవా సమితి అద్యక్షులు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతు ఈ నెలాఖరుకల్లా పట్టణ వ్యాప్తంగా 11 ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి మోహన్, రామాంజి, చంద్ర, వెంకటేష్, అంజన్ రెడ్డి, భగిరథ నవీన్, సూర్యనారాయణ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం

కదిరి టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా సర్వీసులో ఉంటూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటామని ఏపీ జేఏసీ అమరావతి ఎంప్లాయిస్ యూనియన్ అన్నారు. బ్రెడ్ విన్నెర్స్ స్కీం లో వారి కుటుంబంలో అప్లై చేసుకున్న వారికి ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగానే సత్యసాయి జిల్లాలోని ఆర్టీసీలో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలను నాయకులు పరామర్శించారు. వారికి వెంటనే ఉద్యోగాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలోనే ఉద్యోగాల విషయంపై సిఎస్‌కు వినతిపత్రం అందజేసి ఉద్యమంలోకి వెళ్లామన్నారు. స్పందించిన ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టడానికి చర్యలు తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి సత్యసాయి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మైనుద్దీన్, జివైపి. రావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కొటిపి పంచాయతీలోని ఇస్లాం పురం గ్రామంలో ప్రత్యేక శిబిరం చేపట్టారు. ఇందులో బాగంగా మూడవ రోజు సోమవారం గ్రామంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్బంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దేవాలయం ఆవరణం చుట్టూ పెరిగిన ముళ్ల పొదలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనాథ రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల రోగాలు రాకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి అశ్వర్థనారాయణ, వేణు, హరీష్, రఘు, రమేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే అభివృద్ధి

ఓబులదేవర చెరువు : టిడిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆపార్టీ మండల నాయకులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియా పరిశ్రమ తీసుకువచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గురించి తెలుగుదేశం పార్టీ గురించి అవాకులు చవాకుల పేలడాన్ని మానుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, పుట్టపర్తి నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి అంజనేయులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బడిశం రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, మండల మైనార్టీ అధ్యక్షులు షాను పాల్గొన్నారు.

'యువగళం'ను విజయవంతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

త్వరలో ధర్మవరంలో అడుగుపెట్టనున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్రలో నిలిచేలా విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతలపల్లి మహేష్‌చౌదరి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో 40 వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 1వతేదీ శనివారం ఉదయం 9 గంటలకు ప్యాధిండి ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభమై మధ్యాహ్నం వరకూ కొనసాగుతుందన్నారు. తిరిగి అదేరోజు మద్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై ధర్మవరం పట్టణం దాటి మార్కెట్ యార్డు సమీపంలో బస ఉంటుందన్నారు. 2న తిరిగి పాదయాత్ర ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు బహిరంగసభ ఉంటుందన్నారు. కాగా మొన్న ఎమ్మెల్సీ ఎన్నికలతో వైసిపి పని అయిపోయిందన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే వైసిపిని వ్యతిరేకిస్తున్నారన్నారు. 2024లో టిడిపి ఘన విజయం సాధించక తప్పదని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెదన్న, పోతుకుంట లక్కన్న, మేకల రామాంజినేయులు రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, పరిశే సుధాకర్, విజయసారథి, చిగిచెర్ల రాఘవరెడ్డి, కేశగాళ్ల శీన, బీబీ, బొట్టు కిష్ట , మాదన సుబ్బయ్య, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గోరంట్ల మండలం చిన్న రాయినపల్లికి చేరింది. ఈ సందర్భంగా మడకశిర నుండి వాహనాలతో వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న నారా లోకేష్‌ను కలిశారు. ఆయనతోపాటు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర నుండి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దం : నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సోమవారం గోరంట్ల మండలంలో కొనసాగింది. ఈ కార్యక్రమానికి రొద్దం మండల నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి ఆధ్వర్యంలో మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, చిన్నప్పయ్య, రొద్దం నరసింహులు, మాధవనాయుడు, జివిపి నాయుడు, టైలర్ ఆంజనేయులు, చంద్రమౌళి,హరీష్, మురళి, టైలర్ జయరాములు, తదితరులు పాదయాత్రకు తరలివెళ్లారు.